## నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

పోచారం: సింగపూర్‌ టౌన్‌షిప్‌ సబ్‌ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రదీప్‌ కుమార్‌ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్నోజిగూడ, ఎల్‌ఎన్‌ కాలనీ, ఎల్‌ఐజీ, జైపురి కాలనీ, సత్యసాయి, సాయినగర్‌, ఇందిరానగర్‌, రాజీవ్‌ గృహకల్ప, ఆర్‌ఎన్‌ఆర్‌ హైట్స్‌, మయూరి డెవలపర్స్‌, ఎమరాల్డ్‌ హైట్స్‌, సూర్యనగర్‌, సింగపూర్‌ టౌన్‌షిప్‌లోని ఏ1–ఏ50, సీ1–సీ10, డీ1–డీ4 బ్లాకులు, పల్లవి మోడల్‌ స్కూల్‌ ప్రాంతాలకు, ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, సింగపూర్‌ టౌన్‌షిప్‌లోని డీ2, డీ3, డీ4, సీ1, సీ2, సీ3, ఏ24–ఏ35 బ్లాకులకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

**ఘట్‌కేసర్‌లో..**

విద్యుత్‌ లైన్ల మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్‌ 33/11కేవీ సబ్‌స్టేషన్‌, ఎన్‌ఎఫ్‌సీనగర్‌ 11 కేవీ ఫీడర్‌ పరిధిలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు బుగ్గానగర్‌, అంబేడ్కర్‌నగర్‌, పద్మారెడ్డి ముఖద్వారం పరిధిలో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఘట్‌కేసర్‌ ఏఈ యశ్వంత కుమార్‌రెడ్డి తెలిపారు.

## సీఎంను కలిసిన కాంగ్రెస్‌ నాయకులు



సీఎంతో మహేష్‌గౌడ్‌, గోపాల్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్‌: సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం వారి నివాసంలో మున్సిపాలిటీకి చెందిన నియోజకవర్గ కాంగ్రెస్‌ బీ–బ్లాక్‌ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌, మాజీ సర్పంచ్‌ గోపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సురేష్‌నాయక్‌ కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు.

## విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న జేడీ లక్ష్మీనారాయణ

శామీర్‌పేట్‌: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. కేశవరం, మూడుచింతలపల్లిలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో హెచ్‌బీఎల్‌, జేడీ ఫౌండేషన్ల సౌజన్యంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ జాంరవి, సీఎస్‌ఆర్‌ కో–ఆర్డినేటర్‌ విజయలక్ష్మీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న చైర్‌ పర్సన్‌ దీపికరెడ్డి

మేడ్చల్‌: పట్టణంలోని వివిధ వార్డులలో మున్సిపల్‌ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ దీపికనర్సింహారెడ్డి కౌన్సిలర్లు, కాంగ్రెస్‌ నాయకులతో కలిసి ప్రారంభించారు. పట్టణంలోని 14వ వార్డులోని ఎంఆర్‌ఆర్‌ కాలనీ రోడ్డు నెంబర్‌–3లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్‌ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. 17, 23వ వార్డులలో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ పనులను కౌన్సిలర్లు అర్చన సందీప్‌గౌడ్‌, మహేష్‌లతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమాల్లో కమిషనర్‌ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్‌ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్‌: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ అన్నారు. 8, 26 డివిజన్‌ల్లో శుక్రవారం ప్రహరీ గోడ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్‌, కార్పొరేటర్లు పొద్దుటూరి శోభారాణి వెంకటేశ్‌గుప్తా, సీసా వెంకటేశ్‌గౌడ్‌, నేతలు పొన్నం తరుణ్‌గౌడ్‌, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి



కీసరలో.. జయంతి వేడుకల్లో పింగిలి శ్రీపాల్‌రెడ్డి



ప్రతాపసింగారంలోని స్కూల్‌లో..



శామీర్‌పేట్‌లో..ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ వసంతకుమారి

కీసర: రాష్ట్ర ప్రభుత్వం సావిత్రీబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని పీఆర్‌టీయు టీఎస్‌ రాష్ట్ర అధ్యక్షులు ఖమ్మం, నల్గొండ, వరంగల్‌ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని కీసరలో ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పీఆర్‌టీయుటీఎస్‌ సంఘం జిల్లా అధ్యక్షులు రామేశ్వర్‌గౌడ్‌ కార్యకమంలో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, కరీంనగర్‌, మెదక్‌, నిజామాబాద్‌, ఆదిలాబాద్‌ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, పీఆర్‌టీయుటీఎస్‌ కీసర మండల అధ్యక్షులు యాదగిరి, ప్రధాన కార్యదర్శి రజిత, మహిళా ఉపాధ్యాయులు త్రివేణి, విజయలక్ష్మీ, విజయశ్రీ,, కళావతి తదితరులు పాల్గొన్నారు.

**నాగారంలో..**

నాగారం మున్సిపాలిటీలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల్లో మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బండారి మల్లేష్‌యాదవ్‌, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్‌లో.. బహుజన రక్షణ సమితి ఆధ్వర్యంలో

**పోచారంలో..**

ప్రతాపసింగారంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు రవికుమార్‌ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో సావిత్రీబాయి తొలి మహిళా ఉపాధ్యాయురాలని, మొదటి సారిగా బాలికల పాఠశాలలను ఆమె స్థాపించారని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఫిజికల్‌ డైరెక్టర్‌ సునీతను సత్కరించారు.

**ఘట్‌కేసర్‌లో..**

భారతీయ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే 194వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు మైత్రేయి, పద్మావతి, సుభాషిణి, కృష్ణవేణిలను హెచ్‌ఎం పాపిరెడ్డి సత్కరించారు. అలాగే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్‌ చౌరస్తాలో ఆమె చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో రామానుజాచారి, కృష్ణమూర్తి, యాదయ్య, అరుణ, అలివేలు, సునిత, శ్రీకాంత్‌, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



నాగారంలో..



ఘట్‌కేసర్‌లో..

**శామీర్‌పేట్‌లో..**

సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాలోన్ని ఉపాధ్యాయులను మండల విద్యాధికారి వసంతకుమారి శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రీబాయి పూలే అని, ఆదర్శ మహిళగా తనను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు మరింత ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని మహిళా ఉపాధ్యాయుల పాల్గొన్నారు.



అత్వెల్లి పాఠశాలలో.. నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



మేడ్చల్‌లో.. నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

## సైదులుకు ఓయూ డాక్టరేట్‌



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌ జిల్లా శామీర్‌పేట మండలం పరిధిలోని ఒక ప్రైవేట్‌ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్న నల్లగొండ జిల్లా ఓగోడు గ్రామానికి చెందిన అబ్బగాని సైదులుగౌడ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. వర్సిటీ వృక్ష శాస్త్ర విభాగం ప్రొఫెసర్‌ సుజాత మార్గదర్శకత్వంలో 'ఫార్మాకా లాజికల్‌ స్క్రీనింగ్‌ ఆఫ్‌ కోక్యులస్‌ హిర్సుటస్‌ అండ్‌ కాలికోప్టెరిస్‌ ఫ్లోరిబండ' అంశంపై ఆయన ఐదేళ్ల పాటు చేసిన పరిశోధనకు గాను ఈ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. ఉన్నత విద్యను ప్రోత్సహిస్తున్న నూజివీడు విత్తన సంస్థ ఆర్‌ అండ్‌ డి డైరెక్టర్‌ డా. సతీష్‌ కుమార్‌కు ఈ సందర్భంగా సైదులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సైదులుగౌడ్‌కు డాక్టరేట్‌ పొందటంపై స్నేహితులు, వారి కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## నేడు జిల్లా స్థాయి సోషల్‌ టాలెంట్‌ టెస్టు

సాక్షి,సిటీబ్యూరో: కూకట్‌పల్లిలోని జెడ్పీ పీహెచ్‌ఎస్‌లో ఈ నెల 4న(శనివారం) ఉదయం 10:30 గంటలకు జిల్లా స్థాయి సోషల్‌ టాలెంట్‌ టెస్ట్‌ నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడు మధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో సెలెక్టు కాబడిన 101 విద్యార్థులు ఈ టెస్ట్‌కు తప్పనిసరి హాజరు కావాలని కోరారు. వారు హాజరయ్యే బాధ్యతను సంబంధిత సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు తీసుకోవాలని వారు సూచించారు. టెస్ట్‌ తర్వాత జరిగే సమావేశానికి ముఖ్య అతిథిగా మేడ్చల్‌ –మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

# కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలు



సాక్షి,సిటీబ్యూరో: న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ కార్యాలయం వద్ద విద్యాశాఖకు చెందిన సమగ్ర శిక్షా ఉద్యోగులు, సిబ్బంది నిరసన దీక్షలు నిర్వహించారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సంఘసంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌ ఎదుట ఆమె చిత్రపటానికి సమగ్ర శిక్షా ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీఎం రేవంత్‌రెడ్డి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ దీక్షల్లో విద్యాశాఖలో పని చేస్తున్న ఏపీవోలు, డీపీవోలు, సాంకేతిక నిపుణులు, కంప్యూటర్‌ సహాయకులు, భవిత కేంద్రాల్లోని ఉపాధ్యాయులు, రీసోర్సు పర్సన్లు పాల్గొన్నారు. పాఠశాల స్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఆర్ట్‌, క్రాఫ్ట్‌ ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, పీఈటీలు, అకౌంటెంట్లు, కంప్యూటర్‌ సహాయకులు తదితరులు సమ్మెలో పాల్గొన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాలని, పేస్కేల్‌ కల్పించాలని ఉద్యోగులు డిమాండ్‌ చేశారు. ఇందులో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా ప్రతినిధులు జగదీశ్వర్‌, ఫణి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్దపీట





పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

కీసర: మేడ్చల్‌ నియోజకవర్గంలో గల మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధికి పెద్దపీట వేయడం జరుగుతుందని మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 5,6,7 వార్డుల్లో సుమారు 1. 56 కోట్ల నిధులతో చేపట్టిన సీసీరోడ్లు, అంతర్గత మురికి కాలువలు, పార్కు అభివృద్ధి పనులు, కాంపౌండ్‌వాల్‌ నిర్మాణం తదితర అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్‌ నియోజకవర్గంలో 7 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు ఉన్నాయని, తాను మంత్రిగా ఉన్న సమయంలో పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కొత్తగా ఏర్పడుతున్న కాలనీల్లో, అభివృద్ధి పనులు చేపట్టాల్సి వస్తుందన్నారు. సుమారు 120 ఆలయాలను కూడా తమ స్వంత నిధులు వెచ్చించి నిర్మించడం జరిగిందన్నారు. అంతేకాకుండా మేడ్చల్‌ వరకు మెట్రో రైలు విస్తరణ చేపడుతున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ బండారి మల్లేష్‌యాదవ్‌, కమిషనర్‌ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు సబితాంజనేయులుగౌడ్‌, కౌకుట్ల అనంతరెడ్డి, లావణ్య శ్రీనివాస్‌, కౌకుట్ల మమత కృష్ణారెడ్డి, దివ్యదయాకర్‌రావు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

### దుబాయ్‌ సాఫ్ట్‌వేర్‌ సంస్థతో

# మల్లారెడ్డి యూనివర్సిటీ ఒప్పందం




ఎంఓయూ పత్రాలతో ఎమ్మెల్యే మల్లారెడ్డి, సంస్థ చైర్మన్‌ అహ్మద్‌ సుబేర్‌

మేడ్చల్‌ రూరల్‌: మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ శుక్రవారం దుబాయ్‌కి చెందిన సాఫ్ట్‌వేర్‌ దిగ్గజం ఎంహెచ్‌ కాగ్నిషన్‌ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో యూనివర్సిటీ చైర్మన్‌, ఎమ్మెల్యే మల్లారెడ్డి, యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డిలు సాఫ్ట్‌వేర్‌ సంస్థ చైర్మన్‌ అహ్మద్‌ సుబేర్‌తో ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. అనంతరం సాఫ్ట్‌వేర్‌ సంస్థ చైర్మన్‌ అహ్మద్‌ సుబేర్‌ మాట్లాడుతూ దుబాయ్‌ కేంద్రంగా నెలకొల్పిన తమ సంస్థ చెన్నైలో కార్యకలాపాలను నిర్వహిస్తోందని, కృత్రిమ మేధ, మెషిన్‌ లెర్నింగ్‌, ఆధునిక కంప్యూటింగ్‌ వంటి రంగాలలో తమకు ప్రావీణ్యం ఉందన్నారు. ఒప్పందాన్ని అనుసరించి యూనివర్సిటీలోని 130 మంది విద్యార్థులకు నైపుణ్య పరీక్షలు నిర్వహించి 54 మందిని ఎంపిక చేశామని, శిక్షణ అనంతరం దుబాయ్‌లోని కేంద్ర కార్యాలయంలో రూ.12 లక్షల వార్షిక ఆదాయంతో ఉద్యోగం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్‌ ప్రవీణ్‌రెడ్డి, డీన్‌ తయ్యబా ఖాతూన్‌, తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్‌ జిమ్‌ ఏర్పాటు చేస్తాం



జిమ్‌ కోసం వివరాలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య

ఘట్‌కేసర్‌: గురుకుల్‌ క్రీడా మైదానంలో రానున్న రోజుల్లో ఓపెన్‌ జిమ్‌ ఏర్పాటు చేస్తామని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని గురుకుల్‌ క్రీడా మైదానాన్ని శుక్రవారం ఉదయం పరిశీలించి వాకర్స్‌తో మాట్లాడారు. గురుకుల్‌ క్రీడా మైదానం అభివృద్ధి చేయడానికి అవసరమైన వివరాలు, సలహాలు స్వీకరించారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్‌, దేవేందర్‌ ముదిరాజ్‌, శ్రీనివాస్‌గౌడ్‌, శ్రీనివాస్‌రావు, సురేష్‌యాదవ్‌, శ్వేతారెడ్డి, ఈశ్వర్‌, రవిశంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్‌ ఫండ్‌ అందజేత



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న తోటకూర వజ్రేష్‌యాదవ్‌ తదితరులు

కీసర: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం సహాయనిధి నుంచి పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందని మేడ్చల్‌ నియోజవకర్గం కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌ అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ ఈస్ట్‌గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న పాండు (56) అనారోగ్యం కారణంగా నిమ్స్‌ ఆసుపత్రిలో చేరాడు. ఈ నేపథ్యంలో చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 2 లక్షలకు సంబంధించి ఎల్‌ఓసీ పత్రాని ఆయన పాండు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, సత్యంసాగర్‌, దర్గాదయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో లైన్‌ మంజూరు చేయించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య తదితరులు

ఘట్‌కేసర్‌: మెట్రో లైన్‌ విస్తరణలో భాగంగా ఉప్పల్‌ రింగు రోడ్డు నుంచి ఘట్‌కేసర్‌ (ఓఆర్‌ఆర్‌) వరకు మెట్రో లైన్‌ను మంజూరు చేయించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్‌ మేడ్చల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్‌కు శుక్రవారం చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య, కాంగ్రెస్‌ మున్సిపల్‌ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్‌, రాధాకృష్ణ ముదిరాజ్‌ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మేడ్చల్‌, శామీర్‌పేట్‌ వరకు మెట్రో లైన్‌ను పొడిగించిన విధంగానే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఘట్‌కేసర్‌ పరిసరాల అభివృద్ధికి మెట్రో లైన్‌ను పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్‌ వెంకటేష్‌ ముదిరాజ్‌, కౌన్సిలర్‌ మల్లేష్‌, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులు యాదవ్‌, యూత్‌ కాంగ్రెస్‌ మున్సిపల్‌ అధ్యక్షుడు సంజీవరెడ్డి, జంగయ్య యాదవ్‌, రహీం, సత్తిరెడ్డి, ఫరూక్‌భాయ్‌, శ్రీనివాస్‌, రాజారత్నం, నర్సింగ్‌రావు, రాజు, మహబూబ్‌ పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు



ఎదులాబాద్‌లో అధ్యక్ష ఆశావహులతో విజయ్‌కుమార్‌, ప్రవీణ్‌రావు

ఘట్‌కేసర్‌: పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుందని బీజేపీ రూరల్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌ అన్నారు. బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా మండల అధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు అధ్యక్షతన ఎదులాబాద్‌లో అధ్యక్ష నియామకం కోసం ఆశావహుల నుంచి శుక్రవారం అభ్యర్థన పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థుల పని తీరును అధిష్టానానికి అందజేస్తానని అన్నారు. అధ్యక్ష పదవి కోసం శ్రీశైలం, ప్రభంజన్‌, కుమారస్వామి, మశ్చేందర్‌రెడ్డి, బస్వరాజ్‌గౌడ్‌, నరేందర్‌రెడ్డి, మహేష్‌గౌడ్‌ అభ్యర్థన పత్రం అందజేశారు. కార్యక్రమంలో రామోజీ, శ్రీరాములు, నగేష్‌, ఉదయ్‌, మల్లేష్‌, సత్యనారాయణ, సందీప్‌, సాయి, నాగరాజు, చిరంజీవి, హరికృష్ణ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు బైకు దగ్ధం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్వీనగర్‌ సమీపంలో గల ఇండియన్‌ పెట్రోల్‌ బంకు సమీపంలో ప్రమాదవశాత్తు బజాజ్‌ పల్సర్‌ 220 వాహనంలో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. బొడుప్పల్‌ ప్రాంతానికి చెందిన ప్రవీణ్‌ పని నిమిత్తం తన ద్వీచక్రవాహనం బజాజ్‌ పల్సర్‌ 220 పై సిద్దిపేటకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో శుక్రవారం మధ్యాహ్న సమయంలో నాగారం మున్సిపల్‌ పరిధిలోని ఎస్వీనగర్‌ సమీపంలో గల ఇండియన్‌ పెట్రోల్‌ బంక్‌ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా బైకులో నుంచి మంటలు వచ్చాయి. అది గమనించిన ప్రవీణ్‌ బైక్‌ను అక్కడే వదిలేసి పక్కకు జరిగాడు. ఇంతలో బైకులో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో పక్కనే ఉన్న పెట్రోల్‌ బంక్‌ సిబ్బంది, స్థానికుల సహాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే బైకు పూర్తిగా కాలిబూడిదైయింది. ఈ ఘటనలో అదృష్ట వశాత్తు బంక్‌కు ఎలాంటి నష్టం వాటిల్లకపోవడంతో పెట్రోల్‌ బంకు సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితుడి నుంచి వివరాలు సేకరించి పూర్తిగా దగ్ధమైపోయిన బైకును పక్కను తీశారు. చాలా దూరం నుంచి ప్రయాణం చేయడం వల్ల ఇంజన్‌లో మంటలు చెలరేగి ఉండవచ్చునని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు.

# నాటడం ఎందుకు..! నరకడం ఎందుకు..?

కీసర: పచ్చదనాన్ని పెంపొందించేందుకు గత కొన్నేళ్లుగా ఆయా మున్సిపాలిటీల ప్రధాన రహదారులకు ఇరువైపులా అధికారులు హరితహారంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలను (చెట్లు) నాటే కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. విద్యుత్‌ వైర్ల కింద మొక్కలు నాటడంతో కొన్ని ఏళ్ల తరువాత చెట్లు వేపుగా పెరిగి విద్యుత్‌ లైన్లకు తాకుతుండటంతో.. విద్యుత్‌శాఖ అధికారులు తమ సిబ్బందితో వాటిని నరికివేయడం జరుగుతోంది. గత రెండు రోజులుగా భోగారం–కరీంగూడ రహదారిలో, ఇటు అహ్మద్‌గూడ–నాగారం ప్రధాన రహదారిలో విద్యుత్‌ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్‌ సిబ్బంది నరికివేస్తున్నారు. దీంతో లక్షలు వెచ్చించి పచ్చదనం కోసం నాటిన చెట్లు మోడుభారిపోతున్నాయని అటుగా వెళ్తున వాహనదారులు, పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. లక్షలు వెచ్చించి పచ్చదనం కోసం చేసిన లక్ష్యం నీరుగారిపోతోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా రహదారుల పక్కన మొక్కలను నాటే సమయంలో విద్యుత్‌ లైన్ల కింద నాటకుండా అధికారులు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్‌ చేస్తున్నారు.



విద్యుత్‌ సిబ్బంది చెట్లు నరికివేయడంతో మోడుబారిన చెట్లు